క్లుప్తంగా

బుద్ధ శివాజీకి సత్కారం



గౌరీ సంఘం అధ్యక్షుడు శివాజీని సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

గోపాలపట్నం: కేంద్ర గౌరీ సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బుద్ధ శివాజీని గురువారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఘనంగా సత్కరించారు. శాంతినగర్ కార్యాలయంలో శ్రీధర్‌ను గురువారం శివాజీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గజమాల, శాలువలతో ఘనంగా సత్కరించారు. గౌరీపరమేశ్వరుల సేవకుడైన శివాజీ నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు గొంతిన రామకృష్ణ, పొలిమేర ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు

నేడు వాహనాల వేలం

సింహాచలం: నాయుడుతోటలోని పెందుర్తి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు 14 వాహనాలను వేలం వేయనున్నట్లు పెందుర్తి సెబ్ సీఐ ఎం.సరోజాదేవి తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలు తమ వెంట తీసుకుని రావాలని సూచించారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న కమిటీ ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మార్కెట్ వీధిలో కొలువైన పెద్దింటమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి పసుపు కుంకుమలతో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. ప్రసాద్ అనే స్థానిక భక్తుడు అన్నప్రసాదం పంపిణీ చేశాడు. కార్యక్రమంలో ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, కాంట్రాక్టర్ మజ్జి సోమేష్, న్యాయవాది జయశంఖర్ సూరిబాబులు భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

గోపాలపట్నం: కాకానినగర్ ఫీడర్ ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సాకేతపురం, రెల్లివీధి, వినోద్‌నగర్, విమాన్‌నగర్, కాకానినగర్, ఎన్ఏడీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

అభివృద్ధికి అడుగులు

- ఆర్‌కే పురంలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ఆర్‌కే పురంలో సుమారు రూ.19 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సకాలంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం వంటి మంచి కార్యక్రమాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతుంటే.. అది చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందని ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారన్నారు. నిజంగా వారికి చిత్తశుద్ధి ఉంటే వారి హయాంలో చేసిన అభివృద్ధి, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని ఒకసారి పరిశీలించుకోవాలని ఆడారి సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 61వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, పార్టీ 63వ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ విభాగ ప్రతినిధి కొల్లి నూకరెడ్డి, దాడి సత్యనారాయణ, వరలక్ష్మి, బాలు, సోనూ, స్వప్న, బూస అప్పలరెడ్డి, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

హైరిస్క్ గర్భిణులకు బర్త్ ప్లానింగ్ ఇవ్వాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు
- బుచ్చిరాజుపాలెం ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు

మహారాణిపేట: హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి బర్త్ ప్లానింగ్ గురించి తెలియజేయాలని ఆరోగ్య సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. బుచ్చిరాజుపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టిక, మందుల విభాగాన్ని పరిశీలించి పలు సూచనలిచ్చారు. హైరిస్క్ గర్భిణులకు ప్రయాణ సదుపాయం కల్పించాలని, శిశువు ఆరోగ్యం కోసం ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని, ఎర్లీ రిజిస్ట్రేషన్ చేయాలని, అంటువ్యాధి కాని రోగాల (ఎన్‌సీడీ) సర్వే చేయించాలని వైద్యాధికారికి సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఎఫ్ఆర్ఎస్ హాజరు, బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. రిజిస్టర్స్ తనిఖీ చేయాలని, నూరు శాతం సమయానికి హాజరు కావాలని వైద్యాధికారులను ఆదేశించారు. మలేరియా పరీక్షలు సరిగా చేయాలని టెక్నీషియన్లకు సూచించారు. ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రిలో చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని, ప్రసవానంతర సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. వైద్యాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అడుగు తీసి వేయలేం..

- చెత్తతో నిండిన గురజాడ నగర్ రహదారి
- ఇబ్బంది పడుతున్న స్థానికులు

గోపాలపట్నం: అసలే ఇరుకు రోడ్డు.. ఆపై చెత్త వేసి నింపేశారు. దీంతో అడుగు తీసి అడుగేయలేని పరిస్థితి ఏర్పడింది. రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ 52వ వార్డు గురజాడ నగర్‌లోని అధ్వాన పరిస్థితి ఇది. రెండు వారాల కిందట ఇక్కడి గెడ్డలో పూడికలు తొలగించారు. వాటిని అక్కడే వదిలేశారు. దీంతో చాలా మేరకు తిరిగి గెడ్డలో పడిపోయి కొట్టుకుపోయాయి. మిగిలిన చెత్త వల్ల ఈ దారిలో నడిచి వెళ్లేందుకు వీలు లేని విధంగా తయారైంది. ఈ వీధిలో పారిశుధ్య కార్మికులు వచ్చిన దాఖలాలే లేవని స్థానికులు వాపోతున్నారు. నెల రోజులకోసారి వచ్చి కనిపించి వెళ్లుంటారని చెబుతున్నారు. కాలువలు, రోడ్లు అధ్వానంగా ఉండటం ఇందుకు నిదర్శనం. పారిశుధ్య అధికారులు పర్యవేక్షించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని గురజాడ నగర్‌వాసులు కోరుతున్నారు.



గురజాడ నగర్‌లో రోడ్డుపై చెత్త కుప్పలు

అభాగ్యులకు ఆహారం పంపిణీ



ఆహారం పొట్లాలు అందిస్తున్న ట్రస్టు సభ్యులు

కంచరపాలెం: శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ మాజీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కుప్పిలి త్రినాథరావు పట్నాయక్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం అభాగ్యులకు ఆహారం పొట్లాలు అందజేశారు. ముఖ్య అతిథులు రైల్వే కానిస్టేబుల్ బి.బంగారప్పడు, ఎస్ఎస్‌టీఎల్ రిటైర్డ్ గెజిటెడ్ అధికారి టి.వి.చారి వాటిని పంపిణీ చేశారు. కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన, జ్ఞానాపురం, తాటిచెట్లపాలెం, రైల్వే స్టేషన్, దొండపర్తి ప్రాంతాల్లో సుమారు 500 మందికి ఆహారం పొట్లాలు అందించినట్లు ట్రస్టు అధ్యక్షురాలు కుప్పిలి కీర్తి పట్నాయిక్ తెలిపారు. కార్యక్రమంలో మల్లేశ్వరరావు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆరిలోవ ఆస్పత్రిలో మణికి పింఛన్ అందిస్తున్న సచివాలయం కార్యదర్శి రాంబాబు

గోపాలపట్నం: వెంకటాపురం ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన సబ్బవరపు మణి అనారోగ్యంతో ఆరిలోవ ప్రాంతంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆ ప్రాంతంలో ఉన్న వలంటీర్ సెలవులో ఉండటంతో సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శి రాంబాబు గురువారం ఆస్పత్రికి వెళ్లి వేలిముద్ర వేయించి పింఛన్ సొమ్ము అందించారు. ఎక్కడున్నా ఠంఛన్‌గా పింఛన్ అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

భవిత కేంద్రంలో గ్రహణం మొర్రి నిర్ధారణ శిబిరం

సింహాచలం: పెందుర్తి భవిత కేంద్రంలో గురువారం గ్రహణం మొర్రి, గ్రహణశూల గుర్తించడానికి సమగ్రశిక్ష ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాల నుంచి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో శిబిరానికి హాజరయ్యారు. వైద్యులు డాక్టర్ జోషి, డాక్టర్ ముకుందరెడ్డి పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు అవసరమయ్యే విద్యార్థులను గుర్తించారు. వారందరికీ ఉచితంగా శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తామని తెలిపారు.రవాణా ఖర్చులతో పాటు వసతి సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. సమగ్ర శిక్షా విశాఖ జిల్లా ఏపీసీ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐఈసీ ఎం అబ్దుల్ ఆషా, భవిత కేంద్రం ఐఈఆర్‌పీ శారద, ఎనిమిది మండలాల నుంచి ఐఈ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.



నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

శాస్త్రోక్తంగా ధ్వజస్తంభం ప్రతిష్ట



ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న శివాజీ, పండితులు

సింహాచలం: చింతలగ్రహారం గవరకాలనీలోని గోపాలకృష్ణ మందిరంలో బుధవారం ధ్వజస్తంభం ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. వేద పండితులు ధ్వజస్తంభం ప్రతిష్ఠా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవం, యజ్ఞయాగాదులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గీతా పారాయణ, కోలాటం విశేషంగా నిర్వహించారు. మధ్యాహ్నం నాలుగు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. కేంద్ర గౌరీ సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జమునకు ఘన నివాళి

గోపాలపట్నం: ప్రముఖ సినీనటి జమున సంతాప సభను గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు ఘనంగా నిర్వహించారు. గోపాలపట్నం కళాసేవా పీఠం కార్యాలయంలో గురువారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకుడు నందవరపు సోములు జమున జీవిత ఘట్టాలను వివరించారు. ప్రముఖ నటిని కోల్పోవడం సినీ ప్రపంచానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గొరకల రామదాసు, చందు సుబ్బారావు, గంగునాయుడు, ఎం. అప్పారావు, టి. రామారావు, పి. నవీన్ తదితరులు పాల్గొన్నారు.



జమున చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు

పేరాల సాహితీ పురస్కారం ప్రదానం

సీతంపేట: శ్రీవిశ్వనాథ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అవధాని పేరాల భరతశర్మ 90వ జయంత్యుత్సవ సభ నిర్వహించారు. పేరి రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత భైరవభట్ల కామేశ్వరరావుకు పేరాల సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. భైరవభట్ల రచించిన 'పాషాణ పాక ప్రభూ' వ్యాస సంపుటి అనే పుస్తకాన్ని గాయత్రి విద్యా సంస్థల కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు ఆవిష్కరించారు. రచయిత డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో కందాళ సత్యశ్యామ్, పేరాల సీతారామ ప్రభు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



పేరాల భరతశర్మ పురస్కారంతో భైరవభట్ల కామేశ్వరరావు దంపతులు

ఉత్సాహంగా రోల్‌బాల్ దినోత్సవం

మురళీనగర్: ప్రపంచ రోల్‌బాల్ డే వేడుకలను గురువారం మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఘనంగా నిర్వహించారు. కోచ్ పి.సంతోష్ ఆధ్వర్యంలో క్రీడాకారులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు తమ విశేష ప్రతిభను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. రోల్‌బాల్ క్రీడను ప్రోత్సహించినట్లయితే విద్యార్థులు ఉన్నత స్థానంలోకి వెళ్లగలరని కోచ్ సంతోష్ అన్నారు.



కేక్ కట్‌చేస్తున్న రోల్‌బాల్ క్రీడా చిన్నారులు, కోచ్ సంతోష్

క్రమశిక్షణతో ఉన్నత స్థితి

గోపాలపట్నం: క్రమశిక్షణతో అభ్యసిస్తే విజయం సిద్ధిస్తుందని మోటివేషనల్ స్పీకర్ ఆచార్య అజిత్ కుమార్ అన్నారు. మేహాద్రి గెడ్డ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం విశాఖ జిల్లా డీసీవో ఎస్.రూపావతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ పలు సూచనలిచ్చారు. ప్రతీ ఒక్కరిలో అంతర్గత శక్తి ఉంటుందని, దాన్ని గుర్తించి అభ్యాసంగా మార్చుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటామన్నారు. సమయపాలన, ప్రత్యేక శ్రద్ధతో పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. అనంతరం ఆచార్య అజిత్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెంకటరామన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న అజిత్‌కుమార్

వైభవంగా విశేష పుష్పయాగం

- ప్రత్యేక అలంకరణలో లలితాదేవి దర్శనం

సీతంపేట: లలితానగర్ లలితా పీఠం 74వ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం పీఠం దర్బారు హాల్లో లలితా అమ్మవారికి విశేష పుష్పయాగం చేశారు. కుర్తాళం, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో ఆస్థాన వేద పండుతుడు మాచవోలు రమేష్‌శర్మ వేదమంత్రాల నడుమ వివిధ రకాల పూలతో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని చూడముచ్చటగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో పాల్గొని యాగాన్ని తిలకించారు.

లలితాకామేశ్వరుల కల్యాణం నేడు..

లలితా పీఠం దర్బారు హాల్లో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు లలితాకామేశ్వరుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు లలితాకామేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు, మధ్యాహ్నం ఒంటి గంటకు మహాప్రసాద వితరణ నిర్వహిస్తామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



లలితా అమ్మవారికి పుష్పయాగం చేస్తున్న వేద పండితులు, అర్చకులు

యువతకు ఉపాధి అవకాశాలు

మురళీనగర్: డిగ్రీ పూర్తి చేసిన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీసీటీఈ చీఫ్ కో-ఆర్డినేటింగ్ అధికారి బుద్దా చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జాతీయ అప్రంటీస్‌షిప్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, డిగ్రీ పాస్ అయిన విద్యార్థులకు పరిశ్రమల్లో ఏడాది పాటు అప్రంటీస్‌షిప్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పరిశ్రమల ప్రతినిధులు వారి అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ అనంతరం కంపెనీలు నైపుణ్యం కలిగిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటారని చెప్పారు. ఈ వర్క్‌షాప్‌లో సుమారు వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో టోకరా

- టాస్కుల పేరుతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు రూ.8.82 లక్షలకు టోపీ
- సైబర్ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

దొండపర్తి (విశాఖ దక్షిణ): పార్ట్ టైం జాబ్ పేరుతో నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. ఇంటి నుంచే జాబ్ చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చని నమ్మించి ఏకంగా రూ.8.82 లక్షలు కాజేశారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... తగరపువలస ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వాట్సాప్‌కు జీఏఎస్ కంపెనీ రిసెప్షనిస్ట్ అని పరిచయం చేసుకుంటూ ఇంటి నుంచే పార్ట్ టైం జాబ్ చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చని మెసేజ్ చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ముందు వద్దని రిప్లై ఇచ్చినప్పటికీ... అతడిని నమ్మించేందుకు అకౌంట్‌లో రూ.100 జమ చేశారు. దీంతో అది నిజం అని నమ్మి వారితో చాటింగ్ చేయడం ప్రారంభించాడు. పార్ట్ టైం జాబ్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాంలో ప్రకటనలు, మెసేజ్‌లు పంపించారు. వీటికి ఎవరైతే స్పందిస్తారో వారికి కమీషన్ ఆశ చూపిస్తూ కమిషన్ బేస్డ్ టాస్క్ గేమ్స్ కింద వారిని నియమించుకుంటున్నారు. ఇందుకోసం నకిలీ వెబ్‌సైట్‌ను సైతం డిజైన్ చేశారు. దీని ప్రకారం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు యూట్యూబ్‌లో వీడియోస్‌కు లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ చేయమని చెప్పారు. అలా చేసినందుకు ప్రతి లైక్‌కు రూ.100 నుంచి రూ.130 వరకు అకౌంట్‌లో జమ చేశారు. ఇలా మొదటి రోజు బాధితుడికి 4 వీడియోలకు లైక్ చేయమని చెప్పి రూ.400 బ్యాంక్ ఖాతాలో వేశారు. మరో టాస్క్ కోసమని టెలిగ్రాం యాప్‌కి రీడైరెక్ట్ చేసి గైడెన్స్ కోసం ఒక ట్యూటర్‌ని ఇస్తున్నట్లు చెప్పి మొదటి టాస్క్ రూ.54 వేలు పెట్టి కొనాలని నమ్మించారు. అందుకుగాను 30 శాతం కమిషన్‌తో కలిపి రూ.70,200 వస్తుందని చెప్పారు. ఇది నిజమనుకొని సైబర్ నేరగాళ్లు చెప్పినట్లు డబ్బులు ఇచ్చి కొని వారు చూపించిన వెల్ఫేర్ టాస్క్ బటన్ కొట్టగా కమిషన్‌తో కలిపి రూ.70,200 ఇస్తున్నట్లు చూపించి విత్ డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా చేశారు. డబ్బులు విత్ డ్రా చేయాలంటే తప్పనిసరిగా మరికొన్ని టాస్కులు పూర్తి చేయాలని చెప్పి అలా రూ.8.82 లక్షలు కాజేశారు. డబ్బులు విత్‌డ్రా చేసుకోవాలంటే మరికొంత డబ్బులు చెల్లించాలని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన శైలజ



భర్త విజయకుమార్‌తో శైలజ(ఫైల్)

పరవాడ: ఉరిపోసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం స్థానిక జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీలో చోటుచేసుకుంది. సీఐ ఈశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం గ్రామానికి చెందిన పైల విజయకుమార్ కొంత కాలంగా పరవాడ ఆర్‌ఈసీఎస్ విద్యుత్ సంస్థలో సహాయ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఐదేళ్ల క్రితం పెందుర్తి మండలం పులగానిపాలెం గ్రామానికి చెందిన శైలజ(24)ను వివాహం చేసుకొన్నాడు. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. వీరు ఏడాది క్రితం నుంచి పరవాడ దరి జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. భార్యాభర్తలు బుధవారం రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. గురువారం ఉదయం 5 గంటలకు నిద్ర లేచిన విజయకుమార్.. పడకగదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని వేలాడుతున్న భార్యను చూసి క్వార్టర్‌లో నివాసం ఉంటున్న వారికి విషయం చెప్పాడు. ఆమెను కిందకు దించి ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నించగా అప్పటికే మృతి చెందింది. సమాచారం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకున్న భార్య తరపు బంధువులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, తహసీల్దారు ప్రకాశరావు ఘటన స్థలాన్ని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలను భర్తను, బంధువులను అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీం ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది. పోస్టుమార్టం కోసం శైలజ మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

కేకే లైన్లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

అనంతగిరి: కేకే లైన్‌లో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతగిరి మండల పరిధిలో శివలింగపురం రైల్వేస్టేషన్ యార్డు 45వ కిలోమీటర్ వద్ద గురువారం ఉదయం 6 గంటల సమయంలో విశాఖ నుంచి కిరండూల్ వెళుతున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. 8 వ్యాగన్లు పట్టాలు తప్పడంతో ట్రాక్ బాగా దెబ్బతింది. ఓహెచ్‌సీ విద్యుత్ లైన్ తెగిపోవడంతోపాటు.. పట్టాలు తప్పిన బోగీలు ఢీకొట్టడంతో రెండు స్తంభాలు ధ్వంసమయ్యాయి. రైల్వే సిబ్బంది యుద్ధప్రతిపాదికన ఘటన స్థలానికి చేరుకుని, పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. ఈ నెల 3న విశాఖలో బయల్దేరాల్సిన విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు. అలాగే 3న కిరండూల్-విశాఖ(08552) పాసింజర్‌నూ రద్దు చేశారు.



పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్లు

వీక్లీ స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ధన్‌బాద్ - కోయంబత్తూర్ మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ధన్‌బాద్ - కోయంబత్తూర్ (03357 /03358) వీక్లీ స్పెషల్ ధన్‌బాద్‌లో ప్రతీ ఆదివారం ఉదయం 6 గంటలకు బయల్దేరి విశాఖ మీదుగా కోయంబత్తూర్‌కు మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రతీ మంగళవారం మధ్యరాత్రి 12.50 గంటలకు కోయంబత్తూర్‌లో బయల్దేరి విశాఖ మీదుగా గురువారం రాత్రి 10.30 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు ఈనెల 5 నుంచి మార్చి 29 వరకు నడుస్తాయి.

రక్తమార్పిడితో నిలిచిన పాప ప్రాణం

అక్కిరెడ్డిపాలెం: తీవ్ర పచ్చ కామెర్లతో ఆస్పత్రిలో చేరిన ఓ చిన్నారికి షీలానగర్ కిమ్స్ ఐకాన్ వైద్యులు రక్తమార్పిడి చేసి ప్రాణాలు నిలిపారు. ఆస్పత్రిలో గురువారం జరిగిన కార్యక్రమంలో నియోనాటాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ తెన్నేటి ఈ వివరాలు వెల్లడించారు. 'గాజువాక ప్రాంతానికి చెందిన రియానా బేగం ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పాపకు జన్మనిచ్చింది. తల్లి బ్లడ్ గ్రూప్ ఓ నెగిటివ్, బిడ్డ బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్. ఈ కారణంగా పాపకు తీవ్రస్థాయిలో పచ్చకామెర్లు సోకాయి. బిడ్డ పుట్టిన 52 గంటల తర్వాత చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చిన్నారికి వెంటనే పరీక్షలు నిర్వహించాం. పాపకు బిలిరుబిన్ 36 మిల్లీ గ్రామ్స్ పర్ డెసీలీటర్‌గా ఉంది. అది చాలా ఎక్కువ కావడంతో మెదడు కూడా ప్రభావితమై పాప ఊపిరి పీల్చుకోవడం కష్టతరమైంది. ఈ క్రమంలో పలుమార్లు ఫిట్స్‌కు కూడా గురైంది. దీంతో పాపకు శరీరంలో మొత్తం రక్తం తీసేసి.. అదే గ్రూప్‌కు చెందిన కొత్త రక్తాన్ని ఎక్కించాం. వెంటనే బిలిరుబిన్ స్థాయి 17.6కు తగ్గింది. ఒకే గ్రూపులో పాజిటివ్, నెగిటివ్ ఉంటే ఇలాంటి సమస్యలు తలెత్తుతాయి.'అని వైద్యుడు నిఖిల్ వివరించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి.. సంపూర్ణ ఆరోగ్యంతో చిన్నారిని డిశ్చార్జ్ చేశారు. ఈ చికిత్సలో డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు.



పాపతో తల్లిదండ్రులు, కిమ్స్ ఐకాన్ నియోనాటాలజీ విభాగాధిపతి నిఖిల్

మహిళకు బ్యాగ్ అప్పగింత

అల్లిపురం: ఆటోలో మరిచిపోయిన బ్యాగును పోలీసులు వెతికి పట్టుకుని బాధితురాలికి అప్పగించారు. వివరాలివీ.. పోతినమల్లయ్యపాలేనికి చెందిన ఎం .కస్తూరిబాయి బుధవారం తమ ఇంటికి వెళ్లేందుకు జడ్జి కోర్టు వద్ద ఆటో ఎక్కారు. ఆమె వద్ద డ్రై వాష్ చీరలతో బ్యాగ్, హ్యాండ్ బ్యాగ్ ఉంది. గొల్లలపాలెం సర్కిల్ వద్ద డ్రై వాష్ చీరల బ్యాగ్ తీసుకుని దిగిపోయారు. హ్యాండ్ బ్యాగ్ ఆటోలో మరిచిపోయారు. అందులో రూ.లక్ష నగదు ఉంది. కొంతసేపటి వరకు ఆమెకు తన బ్యాగ్ గుర్తుకురాలేదు. తర్వాత తేరుకుని ఆటోలో మరిచిపోయానని గ్రహించారు. ఆటోను పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో టూటౌన్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. డీసీపీ క్రైం జి.నాగన్న ఆదేశాల మేరకు ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ ఎర్రంనాయుడు, టూటౌన్ క్రైం ఎస్ఐలు కె.శ్రీను, డీవీ అప్పారావు తమ సిబ్బందితో కలసి బృందాలుగా ఏర్పడి ఆటోను పట్టుకున్నారు. డ్రైవర్ నుంచి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం బాధితురాలికి నగదుతో సహా బ్యాగ్‌ను అందజేశారు. దీంతో ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



బాధితురాలికి బ్యాగ్ అందజేస్తున్న క్రైం డీసీపీ నాగన్న